దేవీ థియేటర్ 'పొట్టేల్' సినిమా యూనిట్ సందడి

ప్రేక్షకులతో సెల్ఫీ దిగుతున్న హీరో చంద్రకృష్ణ, హీరోయిన్ అనన్య

ఖలీల్‌వాడి, అక్టోబర్ 23 : జిల్లాకేంద్రంలోని దేవీ థియేటర్‌లో పొట్టేల్ సినిమా యూనిట్ బుధవారం సందడి చేసింది. ప్రేక్షకులతో సినిమా ప్రమోషన్‌పై మాట్లాడారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేలా సినిమా తీశామని తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన హీరోయిన్ అనన్య నాగళ్ల, హీరో చంద్రకృష్ణ థియేటర్‌లో ప్రేక్షలకు సెల్ఫీలు ఇస్తూ సందడి చేశారు.

29న జిల్లాకు బీసీ కమిషన్ బృందం రాక

కంఠేశ్వర్, అక్టోబర్ 23 : రాష్ట్రంలో చేపట్టే కులాల గణనపై వివిధ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాల సేకరణ కోసం ఏర్పాటైన తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుల బృందం ఈనెల 29న నిజామాబాద్‌కు రానున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఈనెల 29న నిజామాబాద్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కులగణనపై కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీసీ వెల్ఫేర్ కమిషనర్లతో ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని తెలిపారు. ఆయా కులాల స్థితిగతులపై కమిషన్ బృందానికి ప్రజలు, వివిధ సంఘాల వారు, రాజకీయ పార్టీల బాధ్యులు అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు.

గిరిరాజ్ కళాశాలకు బస్సు సౌకర్యం కల్పించాలి

ఖలీల్‌వాడి, అక్టోబర్ 23 : జిల్లాకేంద్రంలోని గిరిరాజ్ కళాశాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కళాశాలతో సంతకాల సేకరణ చేపట్టారు. నగర కార్యదర్శి చక్రి మాట్లాడుతూ.. గతంలో జీజీ కళాశాలకు బస్సు సౌకర్యం ఉండేదని, ఏడాది నుంచి బస్సు సౌకర్యాన్ని తొలగించాలని అన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం బస్టాండ్ నుంచి జీజీ కళాశాల వరకు బస్సులు నడపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ కళాశాలను రూ. 100 కోట్లతో అభివృద్ధి చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని అన్నారు. జిల్లా కమిటీ సభ్యులు దినేశ్, సుజిత్ పాల్గొన్నారు.

జేసీఐ ఇందూర్‌కు అవార్డులు

ఖలీల్‌వాడి, అక్టోబర్ 23 : జేసీఐ బంజారా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మంగళవారం రాత్రి 'గోవిందం' కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీఐ ఇందూరు అధ్యక్షుడు మనోజ్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాలకు గాను అవార్డులు అందజేశారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, సెల్ఫ్ డిఫెన్స్, జేసీఐ వారోత్సవాల నిర్వహణ, పబ్లిక్ రిలేషన్స్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్, స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ, ఎడ్యుకేషన్ సపోర్ట్ తదితర కార్యక్రమాలు పురస్కారాలు అందాయి. వ్యక్తిగత విభాగంలో పూర్వ అధ్యక్షుడు విజయానంద్‌కు అవార్డు దక్కింది. జోన్ అధ్యక్షుడు గోవింద్ కంకానీ, జోన్ డైరెక్టర్లు శ్రేయా దీక్షిత్, రుబినా మదానీ, గుండా నిఖిల్, జోన్ అధికారులు సుచిత్ర కతూరి, బంగారు రాజు, నల్లాపరం రాజు, గుంటి సంతోష్‌తో పాటు జేసీఐ ఇందూరు ప్రతినిధులకు ముఖ్యఅతిథులు అవార్డులు అందజేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

డిచ్‌పల్లి, అక్టోబర్ 23 : మండలంలోని రాంపూర్ గ్రామంలో పలువురు బాధిత కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్సీ వి.గంగాధర్‌గౌడ్ బుధవారం పరామర్శించారు. డెంగ్యూ వ్యాధితో మృతిచెందిన ఓంకార్ కుటుంబాన్ని, డయాలసిస్‌తో బాధపడుతున్న మాజీ ఎంపీటీసీ భూమయ్యతోపాటు పలు కుటుంబాలను పరామర్శించి, ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు పద్మారావు, సాయన్న, గంగాధర్, తిరుపతి ఉన్నారు.

పోషకాహార లోపం ఉన్న పిల్లలపై దృష్టి సారించాలి

అవగాహన కల్పిస్తున్న సీడీపీవో స్వర్ణలత

ధర్పల్లి, అక్టోబర్ 23 : పోషకాహార లోపంతో బాధపడుతున్న ప్రతి ఒక్క చిన్నారిపై దృష్టి సారించాలని, వారికి కావాల్సిన వైద్యం, పోషణ అందేలా చూడాలని సీడీపీవో స్వర్ణలత సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, సూపర్‌వైజరతో బుధవారం సప్లిమెంటరీ ఫీడింగ్ ప్రోగ్రాంపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బుజ్జి, సరిత, ఆరోగ్య సూపర్‌వైజర్ భూలక్ష్మి, జిల్లా ఐటీ కో-ఆర్డినేటర్ ప్రకాశ్, ప్రాజెక్టు పోషణ అభియాన్ కో-ఆర్డినేటర్ రంజిత్ పాల్గొన్నారు.

వయసుకు తగ్గ బరువు లేని పిల్లలను గుర్తించాలి

మోర్తాడ్, అక్టోబర్ 23: కమ్మర్‌పల్లి, ఏర్గట్ల మండలాల అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సూపర్‌వైజరీ, సప్లమెంటరీ, ఫీడింగ్ అనే అంశాలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ భీమ్‌గల్ ప్రాజెక్ట్ ఏసీడీపీవో జ్ఞానేశ్వరి మాట్లాడారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి, ఏర్గట్ల మండలాల సూపర్‌వైజర్లు గంగహంస, సరస్వతి, హెల్త్ సూపర్‌వైజర్ స్వరూప, జిల్లా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ధాన్యం దళారుల పాలు

- ప్రారంభం కాని కాంటాలు
- అకాలవర్షాలు కురుస్తుండడంతో పొలాల వద్దే దళారులకు విక్రయం

పోతంగల్‌లో పచ్చి ధాన్యాన్ని దళారులకు విక్రయిస్తున్న రైతులు

పోతంగల్, అక్టోబర్ 23 : మండల పరిధిలో పండిన ధాన్యమంతా దళారుల పాలవుతున్నది. ప్రభుత్వం నామమాత్రంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులు ప్రైవేటు వ్యక్తులకే ధాన్యం అమ్ముకోవడానికి మొగ్గు చూపుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద నిబంధనలు, ధాన్యం అమ్మిన డబ్బులు వెంటనే రాకపోవడం, అకాల వర్షాలు తదితర సమస్యల కారణంగా రైతులు దళారులకే ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. క్వింటాలు ధాన్యానికి రూ.2,200 చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. దళారులు ధాన్యాన్ని క్వింటాలుపై రూ. 200 లాభం చూసుకుని ఇతర ప్రాంతాల్లో అమ్ముకుంటున్నట్లు తెలిసింది. ఒకవైపు మంచు, మరోవైపు వానలతో ధాన్యం ఎక్కడ తడుస్తుందోనన్న ఆందోళనతో రైతులు వీలైనంత త్వరగా పంటను విక్రయించేందుకు చూస్తున్నారు.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలకు వద్దు అమ్ముకుందామంటే ఇంతవరకు కాంటాలు ప్రారంభం కాలేవు. వరి కోయాలి, ఆరబెట్టాలి, తాలు, మట్టి లేకుండా చూసుకోవాలి. వాతావరణం సరిగ్గా లేకపోవడంతో మంచు, వానలతో వడ్లు ఎక్కడ తడుస్తాయోనన్న భయంతో దళారులకు రూ. 2,280కు విక్రయిస్తున్నాం. ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలి.

– ఈరుగొండ, రైతు, హంగర్గ

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్23: పీహెచ్‌సీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు పేర్కొన్నారు. ఆలూర్ మండల కేంద్రం, దేగాం పీహెచ్‌సీలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. వ్యాధి నిర్ధారణ కోసం స్థానికంగా యంత్రాలను వినియోగిస్తుండడాన్ని ప్రశంసించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. పీహెచ్‌సీ ఆవరణలో పిచ్చి మొక్కలు ఉండడాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజశ్రీ, వైద్య సిబ్బంది ఉన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన విద్యార్థులు

సారంగాపూర్, అక్టోబర్ 23 : నగర శివారులోని గూపన్‌పల్లిలో ఆదర్శ రైతు చిన్నికృష్ణుడు సాగు చేసిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని రుద్రూర్ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉన్న ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మూడో సంవత్సరం విద్యార్థులు బుధవారం సందర్శించారు. 120 రకాల వరి వంగడాలతో పండించిన ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన వివరాలు, పోషకాలు ఎక్కువగా ఉన్న నాటు వరి రకాల పంట సాగు గురించి విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. ప్రొఫెసర్ డాక్టర్ వెంకట్‌రెడ్డితో పాటు 23 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలో రెండు ప్రాంతాల్లో గంజాయి పట్టివేత

వినాయక్‌నగర్, అక్టోబర్ 23 : జిల్లాకేంద్రంలోని రెండు ప్రాంతాల్లో అధికారులు దాడులు నిర్వహించి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిజామాబాద్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ పర్యవేక్షణలో ఎన్‌ఫోర్స్‌మెంట్ నిజామాబాద్ టీం దాడులు నిర్వహించింది. బోధన్ బైపాస్‌రోడ్డులో గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో బుధవారం బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేశారు. నిందితుల నుంచి 2.50 కిలోల ఎండు గంజాయి లభించిందని, గంజాయి తరలిస్తున్న షేక్ బాబర్ మియా, గుర్రాల శంకర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి బైక్, రెండు సెల్‌ఫోన్లను సీజ్ చేసి, గంజాయితోపాటు ఇద్దరు నిందితులను బోధన్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించామని వెల్లడించారు. దాడులు నిర్వహించిన వారిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై నర్సింహాచారి, సిబ్బంది నారాయణ రెడ్డి, భూమన్న, రాజన్న, ఉత్తమ్, భోజన్న, అవినాశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం ప్రాంతంలో స్కూటీ డిక్కీలో..

స్కూటీ డిక్కీలో గంజాయిని పట్టుకున్నట్లు నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో దిలీప్ తెలిపారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి.సోమిరెడ్డి, సూపరింటెండెంట్ కె.మల్లారెడ్డి ఆదేశాల మేరకు దాడులు చేశామని తెలిపారు. నగర శివారులోని నాగారం ప్రాంతంలో ఓ స్కూటీ డిక్కీలో తనిఖీ చేయగా.. 1.110 కిలోల ఎండు గంజాయి లభించినట్లు వెల్లడించారు. నిందితుడు సాజిద్ అలీపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. దాడులు నిర్వహించిన వారిలో ఎస్సై టి.సుస్మిత, సిబ్బంది ప్రభాకర్, షబ్బీరుద్దీన్, ధర్‌సింగ్, సునీల్, నిస్సార్ పాల్గొన్నారు.

బోధన్ బైపాస్ రోడ్డులో రెండు కిలోలు.. నిందితుల అరెస్టు

శక్కర్‌నగర్, అక్టోబర్ 23 : బోధన్ పట్టణ శివారులోని బైపాస్ రోడ్డులో వైకుంఠధామం వద్ద బుధవారం సాయంత్రం గంజాయి తరలిస్తున్న ఇరువురు వ్యక్తులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అందిన విశ్వసనీయ సమాచారం మేరకు.. సదరు అధికారులు దారికాపలా కాసి, ఓ మోటార్ సైకిల్‌ను ఆపి తనిఖీ చేయగా, ఇరువురు వ్యక్తులు తీసుకుని వస్తున్న 2 కిలోల 50 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైంది. షేక్ బాబర్ మియా, గుర్రాల శంకర్ అనే వ్యక్తులు రెంజల్ మండలం నీలా పేపర్ మిల్‌కు చెందిన వారుగా గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద గంజాయి, ద్విచక్రవాహనం, రెండు సెల్‌ఫోన్లు సీజ్ చేసి బోధన్ ఎక్సైజ్ కార్యాలయంలో ఎస్‌హెచ్‌వో పవన్ గౌడ్‌కు అప్పగించారు. కేసు నమోదు చేశామని సీఐ పవన్ గౌడ్ తెలిపారు.

ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే వేముల

ఎల్ వోసీ అందజేత

భీమ్‌గల్, అక్టోబర్ 23: బడాభీమ్‌గల్‌కు చెందిన ఎల్.గంగామని గుండె సర్జరీ కోసం నిమ్స్ దవాఖానలో చేరగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి స్పందించి మెరుగైన చికిత్స కోసం రూ.1.25 లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. ఎల్‌వోసీ కాపీని బుధవారం కుటుంబ సభ్యులకు హైదరాబాద్‌లో అందజేశారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ

ఖలీల్‌వాడి, అక్టోబర్ 23 : జిల్లాకేంద్రంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా అంతిరెడ్డి రాజిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, నుడా చైర్మన్ కేశ వేణు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి ల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఖలీల్‌వాడి/ డిచ్‌పల్లి, అక్టోబర్ 23 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని సీపీఐ ఎంఎల్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు ఆకుల పాపయ్య, వేల్పూర్ భూమయ్య కోరారు. ఈమేరకు కలెక్టరేట్‌లో డీఎస్‌వో అరవింద్ రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. వరికోతలు ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా ప్రభుత్వం మాత్రం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించకచ నిర్లక్ష్యం చేస్తున్నదని, దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మూడు రోజుల్లో కొనుగోలు ప్రక్రియను ప్రారంభిస్తామని డీఎస్‌వో చెప్పారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రన్న, గంగాధర్, సాయినాథ్ పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్‌అండ్‌బీ ఇంజినీర్ చీఫ్ మోహన్‌నాయక్‌ను బుధవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో సిరికొండ శ్రీ పర్వత వర్ధిని లొంక రామలింగేశ్వర ఆలయ కమిటీ సభ్యులు బుధవారం కలిసి సన్మానించారు. లొంక మహాక్షేత్రానికి వెళ్లే రోడ్డుమార్గంలో నూతన బ్రిడ్జి నిర్మాణానికి రూ.మూడు కోట్ల నిధుల మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

– సిరికొండ, అక్టోబర్ 23

సంక్షిప్తంగా..

- **నేడు క్రాస్ సబ్సిడీ సర్ చార్జీలపై బహిరంగ విచారణ** - కంఠేశ్వర్, అక్టోబర్ 23 : క్రాస్ సబ్సిడీ చార్జీలపై నేడు (గురువారం) కలెక్టరేట్‌లో ఉదయం 10.30 గంటలకు బహిరంగ విచారణ చేపట్టనున్నట్లు ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ), నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టీజీఎన్‌పీడీసీఎల్) ప్రతిపాదించిన 5వ నియంత్రణ కాలానికి (2024-25 నుంచి 2028-2029 వరకు) డిస్ట్రిబ్యూషన్ వ్యాపారం, సమగ్ర ఆదాయ ఆవశ్యకత అండ్ విల్లింగ్ చార్జీలు, రిటైల్ సరఫరా ధరలు, క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీలు తదితర అంశాలపై బహిరంగ విచారణ ఉంటుందని తెలిపారు.
- **28న కామారెడ్డిలో ఉమ్మడి జిల్లా మహాసభ**
ఖలీల్‌వాడి, అక్టోబర్ 23 : ఈనెల 28న కామారెడ్డిలో ఉమ్మడి జిల్లా మహాసభను నిర్వహించనున్నట్లు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు సరికెల పోశెట్టి అన్నారు. జిల్లాకేంద్రంలో ఎంఎస్పీ కార్యకర్తలతో కలిసి బుధవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వర్గీకరణ చేపట్టాలని కోరుతూ ఈనెల 25 నుంచి 30 వరకు మాదిగల ధర్మయుద్ధ ఉమ్మడి జిల్లా మహాసభలు, నవంబర్ 4 నుంచి 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గకేంద్రాల్లోని అన్ని మండల కేంద్రాల్లో మాదిగల ధర్మయుద్ధ దీక్షలు, నవంబర్ 16న దండోరా ధర్మయుద్ధ రథయాత్ర కోదాడ నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. డిసెంబర్ 21న చలో హైదరాబాద్ మాదిగల ధర్మయుద్ధ మహాప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు.
- **రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లకొమ్మల నరికివేత** - చందూర్, అక్టోబర్ 23 : చందూర్ నుంచి మేడ్‌పల్లి గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపులా అడ్డుగాపెరిగిన చెట్లకొమ్మలను స్థానిక శ్రీసాయి విద్యాలయ అధినేత ఉప్పల మధు తన సొంత ఖర్చులతో రెండు రోజులుగా నరికి వేయించారు. బస్సులు, లారీల అద్దాలకు చెట్లకొమ్మలు తగిలి పగిలిపోయాయని, అధికారులు పట్టించుకోకపోవడంతో నరికివేయించామన్నారు.
- **డెంగ్యూ నివారణపై అవగాహన** – డిచ్‌పల్లి, అక్టోబర్ 23 : డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ ఆదేశాల మేరకు డిచ్‌పల్లి మండలంలోని యానంపల్లిలో డెంగ్యూ వ్యాధిపై మండల ఆరోగ్య విస్తరణాధికారి శంకర్ బుధవారం అవగాహన కల్పించారు. ఆయన వెంట గ్రామకార్యదర్శి చరణ్ రాజ్, ఆరోగ్య సిబ్బంది గంగుబాయి, వెంకటరెడ్డి, ఆశ కార్యకర్తలు నిరోష, మంజుల ఉన్నారు.
- **ఎల్ ఆర్ఎస్ స్థలాల పరిశీలన** - ధర్పల్లి, అక్టోబర్ 23 : ప్లాట్లు, భూముల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారి స్థలాలను మండల కేంద్రంలో ఎంపీడీవో బాలకృష్ణ బుధవారం పరిశీలించారు. ఆయన వెంట జీపీ కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.
- **27న ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సభ**- రుద్రూర్, అక్టోబర్ 23 : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో ఈ నెల 27న నిర్వహించనున్న మాల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని మాల పొలిటికల్ జేఏసీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్ కోరారు. మండలకేంద్రంలో సభకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల నాయకులు నవీన్‌కుమార్, కిశోర్, కోర్బ శ్యాం, కార్తీక్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

నందిపేట్/భీమ్‌గల్/సారంగాపూర్, అక్టోబర్ 23 : నందిపేట్ మండలంలోని ఖుద్వాన్‌పూర్ పరిధిలోని వన్నెల్(కె), సిద్ధాపూర్ గ్రామాల్లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ ఖుద్వాన్‌పూర్ చైర్మన్ వాకిడి కార్తీక్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వాకిడి కృష్ణారెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. భీమ్‌గల్ మండలంలోని చేంగల్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, మార్కెటింగ్ డీపీఎం సాయిలు ప్రారంభించి మాట్లాడారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహిపాల్, జీవన్, ఏపీఎం రవీందర్, సెర్ప్ అధికారులు గడాల రఘుపతి, సీసీ శ్రీనివాస్, మహిళా సంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

చేంగల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ పాలెపు నర్సయ్య

నిజామాబాద్ రూరల్ మండలంలోని మల్కాపూర్ తండాలో ముత్తకుంట సొసైటీ పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ పైసా స్వామి, సీఈవో రాము నంబూద్రి పాగ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు ప్రకాశ్, ప్రేమ్‌దాస్, రైతులు పాల్గొన్నారు.

తండ్రిని చంపిన తనయుడి అరెస్టు

నవీపేట, అక్టోబర్ 23: రెండు రోజుల క్రితం ఆస్తి కోసం కన్న తండ్రిని చంపిన తనయుడు మహిపాల్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్‌కుమార్, ఎస్సై వినయ్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అనంతగిరి గ్రామానికి చెందిన జీపీ పారిశుద్ధ్య కార్మికుడు గౌరు అమృతంకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మహిపాల్, రెండో కుమారుడు మనోజ్. వీరు కొన్నేండ్ల క్రితం బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశం వెళ్లారు. అమృతం పిల్లలు పుట్టాకా తన భార్యను సరిగ్గా చూసుకోక పోవడంతో ఆమె మాక్లూర్ మండలం గొట్టు ముక్కల గ్రామానికి 20 ఏండ్ల క్రితం వెళ్లి పోయింది. జీపీ కార్మికుడిగా పనిచేస్తున్న అమృతం వచ్చిన జీతంతో మద్యం తాగుతూ, జులాయిగా తిరుగుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. భార్య, పిల్లలను పట్టించుకోవడం లేదు. దీంతో అనంతగిరి గ్రామంలో ఉన్న రెండు ఇండ్లను అమ్ముకొని గొట్టుముక్కల గ్రామంలో ఇల్లు కట్టుకోవాలని అనుకున్న నిందితుడు తండ్రిని చంపాలని పథకం పన్నాడు. 15 రోజుల క్రితం దుబాయ్ నుంచి అనంతగిరికి వచ్చాడు. ఈ నెల 21న రాత్రి తండ్రీకొడుకులు తప్పతాగారు. మద్యం మత్తులోకి జారుకున్న తండ్రిని కుమారుడు మహిపాల్ గొంతుకు టవల్‌ను బిగించి హత్యచేశాడు. అనంతరం గ్రామానికి చెందిన ప్రసాద్ అనే ఆర్ఎంపీతో సహజ మరణంగా చిత్రీకరించాడు. అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తూ స్నానం చేయిస్తుండగా, గాయాలు కన్పించడంతో బాగోతం బయటపడింది. నిందితుడి సోదరి ఫిర్యాదు మేరకు గాలింపు చర్యలు చేపట్టి నిందితుడు మహిపాల్‌ను జానకంపేట్ సమీపంలో పట్టుకొని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్సై వివరించారు.

సంక్షిప్తంగా..

- **విద్యార్థులకు అభినందన**- భీమ్‌గల్, అక్టోబర్ 23: ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లను సాధించారు. హీనా సహర్ రాజధానిలో గాంధీ మెడికల్ కళాశాలలో, అరేబియా మీర్జా జగిత్యాల్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీట్లను సాధించినట్లు ప్రిన్సిపాల్ చిరంజీవి తెలిపారు. విద్యార్థులను అభినందించారు.
- **ట్రాన్స్ ఫార్మర్, జనరేటర్ తొలగించాలి** - ఆర్మూర్‌టౌన్,అక్టోబర్23: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మహలక్ష్మి కాలనీ బాలాజీ అపార్ట్‌మెంట్ ఎదుట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, జనరేటర్‌ను తొలగించాలని కోరుతూ కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ రాజు, ట్రాన్స్‌కో డీఈ నాగేశ్వర్ రావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. నివాస గృహల మధ్య ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు.
- **విద్యార్థులకు అవగాహన** - మాక్లూర్, అక్టోబర్ 23: మండలంలోని చిన్నాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలీసులు బుధవారం యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పిల్లల అపహరణలు ఏవిధంగా జరుగుతున్నాయి, వాటి నుంచి ఏ విధంగా రక్షించుకోవాలనే విషయాలు వివరించారు. హెచ్ఎం రాజేందర్, సలహాదారు నరేశ్ పాల్గొన్నారు.
- **మహిళ అదృశ్యం**- ఎడపల్లి, అక్టోబర్ 23: మండల కేంద్రంలో ఓ మహిళ అదృశ్యమైంది. బుధవారం ఎస్సై వంశీకృష్ణా రెడ్డి కథనం ప్రకారం.. ఎడపల్లి గ్రామానికి చెందిన దొనగంటి అర్చన (26) ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. తిరిగి రాకపోవడంతో ఆమె భర్త గంగాదాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.
- **కుక్కలకు స్టెరిలైజేషన్ నిర్వహిస్తాం**- ఆర్మూర్‌టౌన్, అక్టోబర్23: పట్టణ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు రెండు రోజులుగా పట్టణంలోని కుక్కలను పట్టుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ రాజు బుధవారం తెలిపారు. కుక్కలను నిజామాబాద్‌లోని ఏబీసీ సెంటర్‌కు తరలిస్తున్నామని తెలిపారు. అక్కడ కుక్కలకు స్టెరిలైజేషన్ నిర్వహించి వాటిని పట్టుకున్న చోటే వదిలిపెడతామని తెలిపారు.
- **హోటళ్లలో అధికారుల దాడులు**- ఆర్మూర్‌టౌన్,అక్టోబర్23: పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో బుధవారం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. శానిటరి ఇన్‌స్పెక్టర్ గజానంద్ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటించని హోటళ్లపై దాడులు నిర్వహించి జరిమానాలు విధించినట్లు తెలిపారు. దుకాణదారులు ప్లాస్టిక్ వినియోగిస్తే ప్రజలు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. జ్యూట్ బ్యాగులను వాడాలన్నారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.
- **విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన**- ఆర్మూర్‌టౌన్,అక్టోబర్23: విద్యార్థులు సెల్‌ఫోన్లలో వచ్చే అనవసరమైన లింకులను ఓపెన్ చేసి సైబర్ మోసాలకు గురికావద్దని సైబర్‌క్రైమ్ డీఎస్పీ వై.వెంకటేశ్వర్ రావు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సైబర్ క్రైమ్, సైబర్ సేఫ్టీ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో రవి కుమార్, కళాశాల ప్రిన్సిపల్ వేణు ప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.
- **స్థల పరిశీలన** - ధర్పల్లి, అక్టోబర్ 23 : మండల కేంద్రానికి నూతనంగా మంజూరైన రెండు ఆరోగ్య సబ్‌సెంటర్ల నిర్మాణం కోసం బుధవారం ఎంపీడీవో బాలకృష్ణ స్థలాలను పరిశీలించారు. మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో పాత ఐకేపీ కార్యాలయం వద్ద ఒకటి, హొన్నాజీపేట్ రోడ్డులో ఒకటి నిర్మాణం కోసం స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు.
- **కబ్జాలకు గురైన కాల్వలను కాపాడాలి**
మాక్లూర్, అక్టోబర్23: మానిక్‌బండార్ శివారులో కబ్జాలకు గురైన నిజాంసాగర్ డి-16 కెనాల్ కాల్వను కాపాడాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్ కోరారు. ఆయన బుధవారం మానిక్‌బండార్‌లో విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో నాయకులు అబ్బయ్య, సంజు, రాజేశ్వర్, భీమ్ సింగ్, నర్సయ్యా పాల్గొన్నారు.
- **అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన**
నందిపేట్, అక్టోబర్ 23: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అగ్నిమాపక సిబ్బంది మధుకర్, సురేశ్, సిరాజ్, షఫీ అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫైర్ సేఫ్టీ పరికరాలను ఉపయోగించే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, హెచ్‌ఓడీలు కిశోర్, లావణ్య, లక్ష్మణ్ శాస్త్రి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.
- **రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారులు**
కంఠేశ్వర్, అక్టోబర్ 23 : గద్వాల్‌లో నేటి నుంచి ఈనెల 25 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ తైక్వాండో చాంపియన్‌షిప్‌నకు జిల్లా నుంచి క్యూరియస్ తైక్వాండో అకాడమిక్‌కు చెందిన ఏడుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. క్రీడాకారులను అధ్యక్షుడు ప్రవీణ్, ప్రధానకార్యదర్శి వినోద్‌నాయక్, కోశాధికారి వినోద్ అభినందించారు.
- **చెరువుల్లో చేపపిల్లల విడుదల**-శక్కర్‌నగర్, అక్టోబర్ 23: బోధన్ పట్టణ శివారులోని రెండు చెరువుల్లో అధికారులు, గంగపుత్రులతో కలిసి బుధవారం చేపపిల్లలను విడుదల చేశారు. పాండు చెరువు, చెక్కి తలాబ్‌లలో సుమారు 52వేల చేప పిల్లలను బోధన్ తహసీల్దార్ విఠల్, ఏవో సంతోష్ నాయక్, ఆర్ఐ వరుణ్ గంగపుత్రులు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘ నాయకులతో కలిసి వదిలారు.
- **హామీలను అమలు చేయాలి** -శక్కర్‌నగర్, అక్టోబర్ 23: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, నిజాం చెక్కెర కర్మాగారాన్ని తెరిపించాలని సీపీఎం జిల్లా సహాయ కార్యదర్శి ఎ.రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం బోధన్ పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో నిర్వహించిన సీపీఐ (ఎం) 2వ ఏరియా మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాయకుడు గంగాధరప్ప జెండావిష్కరణ చేశారు. సభలో బోధన్ ఏరియా కార్యదర్శి జె.శంకర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.
- **అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు సన్మానం**- మోర్తాడ్, అక్టోబర్ 23: మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీకళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ రవీందర్‌కు రాజనీతిశాస్త్రంలో డాక్టరేట్ పొందిన సందర్భంగా బుధవారం కళాశాలలో ఆయనను ప్రిన్సిపాల్ పెద్దన్న, అధ్యాపకులు సన్మానించారు. వైస్‌ప్రిన్సిపాల్ మగ్రిభూపతి, సిబ్బంది పాల్గొన్నారు.
- **ఉపాధిహామీ పనుల గుర్తింపు**- ఏర్గట్ల, అక్టోబర్ 23: మండలంలోని దోంచంద గ్రామంలో చేపట్టాల్సిన ఉపాధి హామీ ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం అధికారులు గుర్తించారు. కార్యక్రమంలో ఏపీవో వెంకటేశ్, టీఏ గంగాధర్, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.
- **తాళం వేసిన ఇంట్లో చోరీ**-మోర్తాడ్, అక్టోబర్ 23: మండల కేంద్రంలో తాళం వేసిన ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఎస్సై విక్రమ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన అరటి వినయ్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వేరే ఊరికి వెళ్లారు. దీంతో దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి రెండు తులాల బంగారం, పది తులాల వెండి పట్టగొలుసులు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.
- **ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో**
మోర్తాడ్, అక్టోబర్23: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ ప్రాంతం నుంచి వరద ఉధృతి పెరిగింది. దీంతో ప్రాజెక్ట్ ఎనిమిది గేట్లు ఎత్తి గోదావరిలోకి మిగులు జాలాలను అధికారులు వదులుతున్నారు. ప్రాజెక్ట్‌లోకి 39,446 క్యూసెక్కుల వరద వస్తున్నది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు(80.5టీఎంసీలు) కాగా, ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1091అడుగులు (80.501టీఎంసీలు) నీటినిల్వ ఉన్నది.
- **జీపీ మడిగెలకు వేలం** - రెంజల్, అక్టోబర్ 23: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం జీపీ మడిగెలకు వేలం నిర్వహించామని ఎంపీడీవో, గ్రామ ప్రత్యేకాధికారి వెంకటేశ్‌జాదవ్ తెలిపారు. ఉన్నతాధికారులు నిర్ణయించిన ధర ప్రకారం డిపాజిట్ రూ.20వేలు, ప్రతినెలా అద్దె రూ.1800 దక్కించుకున్న మూడు మడిగెలకు రెండు సంవత్సరాలు కాల పరిమితితో అప్పగించినట్లు ఎంపీడీవో తెలిపారు. మండల పర్యవేక్షకుడు శ్రీనివాస్, ఎంపీవో రఫియొద్దీన్, కార్యదర్శి రాజేందర్‌రావు పాల్గొన్నారు.
- **కుల రహిత సమాజమే గంగారాం లక్ష్యం**
బోధన్ రూరల్, అక్టోబర్ 23: కుల రహిత, దోపిడీ లేని సమాజమే చింతం గంగారాం ఆశయమని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ అన్నారు. బుధవారం సాలూరా మండలంలోని ఖాజాపూర్‌లో చింతం గంగారాం సంతాపసభకు ఆయన హాజరై మాట్లాడారు. గంగారాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

PASSPORT MISSING
★I KULAKARNI RAMARAO H.no:5-6-357, Saraswathi nagar, Road No -1, Nizamabad, I Lost My Original Passport No : V3195615 If any one found Please Cont : 82473 69310.
NTZ-334489

PASSPORT MISSING
★I KULAKARNI KIRAN W/o KULAKARNI RAMARAO, H.no:5-6-357, Saraswathi nagar, Road No -1, Nizamabad, I Lost My Original Passport No : V3196063 If any one found Please Cont : 82473 69310.
NTZ-334490

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/- ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ఆర్మూర్‌టౌన్/బోధన్ రూరల్/ఏర్గట్ల, అక్టోబర్23: జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అధికారులు బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలను తహసీల్దార్ గజానన్, మున్సిపల్ కమిషనర్ రాజు, ఎంఈవో రాజగంగారాం తనిఖీ చేశారు. ఇటీవల మధ్యాహ్న భోజనంలో పురుగులు రావడంతో విచారణ చేపట్టేందుకు వచ్చినట్లు తెలిపారు. రిపోర్టు రూపొందించి ఆర్డీవోకు పంపిస్తున్నట్లు తెలిపారు.బోధన్ మండలంలోని రాజీవ్‌నగర్ తండా, ఊట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో బాల గంగాధర్ తనిఖీ చేశారు. ఆయన విద్యార్థులకు భోజనాన్ని వడ్డించి వారితో మాట్లాడారు. అంతకు ముందు రాజీవ్‌నగర్ తండాలో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.

కేజీబీవీ..

ఏర్గట్ల మండల కేంద్రంలోని కేజీబీవీని మండల విద్యాధికారి అనంద్‌రావు తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సీఆర్‌పీ ప్రసాద్, సీఆర్టీలు లలిత, శాంత ఉన్నారు.

రేషన్ డీలర్ల ఎంపిక

శక్కర్‌నగర్, అక్టోబర్ 23: బోధన్ డివిజన్‌లోని పలు రేషన్ దుకాణాలకు ఎంపికైన డీలర్ల వివరాలను బుధవారం బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి అధికారులు విడుదల చేశారు. డివిజన్‌లోని 18 దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించగా, రెండు దుకాణాలకు దరఖాస్తులు రాలేదు. 16 దుకాణాలకు గత నెల 26న బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాత పరీక్షలు నిర్వహించారు. ఎంపికైన వారి పూర్తి వివరాల కోసం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సంప్రదించాలని వెల్లడించారు.

పశువులకు టీకాలు

మెండోరా/మాక్లూర్,అక్టోబర్23: మెండోరా మండలం దూదిగాం గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించినట్లు పశువైద్యాధికారి గౌతంరాజ్ బుధవారం తెలిపారు. మాక్లూర్ మండలంలోని బోర్గాం(కె), గాలిబ్ నగర్, గద్వాల్ క్యాంప్‌లో 476 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని పశు వైద్యాధికారి ఉమామసాహెర్, డాక్టర్ కిరణ్‌దేశ్‌పాండే తెలిపారు.